# రాజీ

వెలుగు పరుచుకుంటోంది.

నారింజ చెట్టుమీద పక్షులు అరుస్తున్నాయి.

రాజేశ్వరి కూజాబిందె పట్టుకొని నూతి దగ్గరికొచ్చింది. నారింజ చెట్టుమీద కిలకిలలాడే పక్షుల్ని చూస్తే రాజేశ్వరికి సంతోషం పొంగింది. బళ్లో చదువుకునే రోజులు జ్ఞాపకం వచ్చాయి.

వెంకటలక్ష్మికి మూడు రోజులయి జ్వరంగావుంది.యివ్వాళ పథ్యం పెట్టొచ్చునన్నాడు డాక్టరు. చుట్టం చూపుకుకొచ్చిన అక్కయ్య ఇక్కడ జ్వరం పడడం ఆమెకి కష్టం తోచింది. రాజేశ్వరికి అక్కయ్యమీద ఎనలేని అభిమానం. వెంకటలక్ష్మికి చెల్లెలంటే ప్రాణం. చెల్లెలికి మంచి భర్తకాడని చాలా సంతోషించేది.

నలుగురితోనూ మాట్లాడేటప్పుడు మరిది గురించి—"మా సత్యమేనా-చాలా మంచివాడు. అలాంటివాడు నిజంగా...."అంటో వుంటుంది.

సత్యానికి వదినగారంటే చాలా గౌరవం. ఆవిడని మీరంటాడు. మొదటిలో ఆవిడ తిరిగి మీరనబోతే వారించాడు. దానితో వెంకటలక్ష్మికి సత్యమంటే అభిమానం మరీ ఎక్కువయింది. సత్యంకంటే ఆమె ఒక పదేళ్ళు పెద్దది.

సత్యం కెమిస్టు.

'అక్కా' అన్నది రాజేశ్వరి

వెంకటలక్ష్మి వెంటనే పలికింది. మెలుకువొచ్చి చాలా సేపయినా నీరసంగా వుండి ఆమె లేవలేదు.

''యట్లా వుందే?''

నుదుటిమీద చెయ్యివేసి చూసింది చెల్లెలు. జ్వరం దిగింది.

"నీరసంగా వుందే" అన్నది నీరసంగా అక్క.

సత్యం బ్రష్‌తో పళ్ళుతోముకుంటున్నాడు.రాజేశ్వరి నీళ్ళబిందె తెస్తోంది. రాజేశ్వరికూడా బిందె నడుంమీద పెట్టుకొని అట్లా తెస్తూవుంటే అతనికి నిజంగా బొట్టు సరదావేసింది.

''వోయ్'' అన్నాడు.

'వోయ్' అన్నది రాజేశ్వరి

అతను ఇంతకుముందెప్పుడూఅలాపిలవలేదు.రాజీఅని పిలిచేవాడు.ఈ సారి అట్లా పిలిచేసరికి రాజేశ్వరికి పెద్దకోపం వచ్చింది. అందుకే తను కూడా వోయ్

అన్నది. రాజేశ్వరి అలా అంటుందని అతననుకోలేదు. అతనికీసారి నిజంగానే సరదావేసింది. అందుకు తగినవేషంలో లేడు కనుక తమాయించుకోక తప్పలేదు.

'నీళ్ళు' అన్నాడు

"మీ పక్కనే వుందిగా నీళ్ళచెంబు"

అతనికా విషయం తెలియకడగలేదు.

'వేన్నీళ్ళు'

''ఇంకా కుంపటి ముట్టించారే''

"కాఫీ వేస్తున్నావుగా వుననుకున్నాను."

''పా—పం—కష్టపడలేరు''

మొహం కడుక్కోవడం ముగించాడు. చాలా మృదువుగా 'రాజీ' అని పిలిచాడు. ఆమె ప్రసన్నమయింది.

'ఏం' అంటూ దగ్గరకొచ్చినుంచుంది.

అట్లా చూస్తున్నాడు ఆమెనే. అతనికొకసారి అట్లా అనిపిస్తుంది. అలా ఆమె కళ్ళల్లోకి చూస్తూఉండిపోవాలని—

"యేమిటలా చూస్తున్నారు."

రాజేశ్వరి తలవెరిగివుంది. ముంగురులు నుదుటిమీద చెంపలమీద ఎగురుతున్నాయి. చెవులకున్న బంగారపురింగుల మెరుపు మెడమీద పాకుతోంది.

'నిన్నే'

"చా వుంది మీరు మరీనూ—"

"వెళ్ళిపోయింది"

"మొహం తుడుచుకోవాలి"

"తువ్వాలు తెస్తా వుండండయితే"

పమిటచెంగు పట్టుకొని దగ్గిరికి లాక్కున్నాడు

"తువ్వాలయితే నే తెచ్చుకోలేనా?" అన్నాడు, పమిటతో మొహం తుడుచుకుంటూ.

అతను తన పమిటచెంగుతో మొ హ ం తుడుచుకుంటుంటే అలా చూస్తూనుంచుండిపోయింది. అలాంటి నమయాల్లోనే అతనంటే వల్లమాలిన అభిమానం పుట్టుకొచ్చి,అతనికోసం పోతేనే—అనిపిస్తుంది. చెంగు చేతిలోకి తీసుకుని అతని చెవుల కింద మెడమీద తడివొత్తింది.

''రాజీ''

తలెత్తి అతని కళ్ళల్లోకి చూసింది. ఆ కళ్ళల్లోకనిపించే తరగని ఉత్సాహమే

తనని నడిపిస్తోంది. జన్మ జన్మలకి ఆ కళ్ళే, ఆ చూపులే తనక్కావాలి.

ఆమెవేళ్ళు ముద్దుపెట్టుకున్నాడు.

వెంకటలక్ష్మి వేన్నీళ్ళతో మొహం కడుక్కుంది. టెంపరేచర్ చూడబోతే సబ్‌నార్మల్ వుంది.

"యివ్వాళకాస్త ఎంగిలిపడు" అన్నది చెల్లెలు. వెంకటలక్ష్మి మాటాడలేదు. ఆమె కెందుకో హాయిగావున్నది. జ్వరం వచ్చి తగ్గుతున్నప్పుడు వొకవిధమైన హాయి అనిపిస్తుంది.

అక్కయ్యకు కాఫీ యిచ్చింది రాజేశ్వరి. కాఫీ తాగేటప్పటికి వెంకటలక్ష్మి ఒళ్ళంతా కాస్త చమటపట్టింది. నారింజ చెట్టు మీదనుంచి వచ్చిన గాలి వొంటిని తాకగానే తనకు జ్వరం వచ్చిందన్న సంగతే మర్చిపోయింది.

.... .... ....

చూసేసరికి ఆపుకోలేనంత కోపం వచ్చింది సత్యానికి.

"తెల్లారి లేవగానే గొప్ప ఘనకార్యమే చేశావు!"

అతను ఎంతో ప్రాణంపడి కొన్న బొమ్మకి రాజేశ్వరి చెయ్యితగిలి కింద పడి ముక్కలుముక్కలయిపోయింది. నామరూపాల్లేకుండా పోయింది.

అతను బట్టలు వేసుకోవడం పూర్తిచేశాడు సోఫాలోకూర్చుని బూట్లుతోసాటు సాక్సు తొడగబోయింది.

''వొద్దులే. వెళ్ళి పనిచూసుకో''

అతను డ్యూటీకి వెళుతున్నాడు. మధ్యాహ్నం వచ్చి రెండుమెతుకులు తిని వెంటనే వెళిపోతాడు. మళ్ళా సాయంత్రం ఆరు దాటాకగాని ఇంటికిరాడు.

రోజూ అస్తమానం అతను ఆఫీసుకు బయలుదేరే సమయం, ఎట్లా వుంటుందో తలచుకునేసరికి రాజేశ్వరి కళ్ళల్లో నీళ్ళు తిరిగినయ్. బుగ్గమీద చిటిక లేసి గాలిలో ముద్దులు విసురుతూ "టాటా రాజీ" అంటూ వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ వెళ్ళేవాడు. కనిపించేవరకూచూసి, తియ్యటిబరువుతో, లోపలికొచ్చి వంట పని చేసుకొనేది.

నెమ్మదిగా ముక్కలన్నీ ఏరి వొక కాగితంలోకి తీసింది. వాటిని దూరంగా నారింజచెట్టు అవతల చాలాదూరంగా పారేయ్యడానికి వెళ్ళింది.

అంత అందమైనవి పారేస్తున్నప్పుడు జీవితమంటే ఇంతేగావును, ఏదైనా ఇంతే గావుననిపించింది రాజేశ్వరికి.

తిరిగివచ్చేసరికి అతనులేడు. డ్యూటీకివెళిపోయాడు. ఒంటిగంట దాటుతున్నా భోజనానికి రాలేదు. బావుండదని ఇంతవరకూచూసి వెంకటలక్ష్మి పథ్యం తిన్నది.

రాజేశ్వరివల్ల జరిగిన పొరపాటుకి ఆమెకూడా చాలా నొచ్చుకుంది. కాని సత్యం ఆ కోపంమీద వెళ్ళినవాటు యింతవరకూ రాకపోవడం ఆమెకు నచ్చలేదు. ఇంతకుముందెప్పుడతనలా చేసివుండలేదు. అలాంటి పరిస్థితి ఏర్పడలేదు.

గోడగడియారం రెండుకూడా కొట్టింది.

రాజేశ్వరికి ఏమీ పాలుపోయిందికాదు. బాగా ఆకలవుతున్నాది. కాని అతనికుండా ముందు తను తినడమనేది ఆమె దృష్టిలో క్షమించరాని తప్పు.

ఒకరోజున—"ఎవరుచెప్పారీ పురాణం నీకు! లే-లే" అన్నాడు, విషయం విని. యిద్దరూ కలసి భోజనం చేశారు. ఆ రోజును రాజేశ్వరి మరువలేదు.

రెండున్నరవుతూవుండగా సత్యం వచ్చాడు.

"లేవండి భోజనరి చేద్దురుగాని-"అన్నది రాజేశ్వరి.

సత్యం బట్టలుమార్చుకొని సోఫాలోకూర్చుని పేపరు చదువుకుంటున్నాడు మొహంలో చాలా గాంభీర్యమూ, లీలగా బాధా కనిపిస్తున్నాయి. మాటాడటంలేదు. రాజేశ్వరి కాసేపు వూరుకొని మళ్ళా పిలిచింది.

"నువ్వు భోంచేశావా?"

చేసినట్టు తలవూపింది జాలిగా నీరసంగా చెవి రింగులు అందంగాకదిలాయి అదే మరోసారయితే ఆ రింగులు మెడమీద తగిలేచోట ముద్దుపెట్టుకునేవాడే.

అతను లేవలేదు.

వెంకటలక్ష్మి పిలిచింది.

"ఏమోయ్-లేచిభోంచెయ్యవూ-"

"చేశాను"

"యెప్పుడూ?"

మాటాడలేదు. సంభాషణ స్తంభించిపోయింది. అన్నింటికంటే వింతఏమిటంటే వెంకటలక్ష్మితో అతనలా మాట్లాడటం-

ఎవరుచెప్పినా విననిమాట ఏదయినావుంటే-అది వెంకటలక్ష్మివదిన చెబితే వినేవాడు. అటువంటిది అతనిప్పుడట్లా మాట్లాడటం అక్కా చెల్లెళ్ళిద్దరికీ కొత్తగావుంది

ఎనిమిది కొడుతోవుండగా సత్యం ఇంట్లోపడుగుపెట్టాడు అతని మనసు బొత్తిగా బాగులేదు.లోపల పశ్చాతాపం రగుల్తోంది. తాను ఎందుకంతపనిచేసినట్టు? యెప్పుడయినా చేశాడా? పోనీ చేస్తానని కలలోనయినా అనుకున్నాడా? ఎప్పటికీ అట్లా ముద్దులు పెట్టుకుంటూ వుండిపోదామనుకునే ఆ చెంపమీద— ఆ లేత చెంపమీద—....ఊహించుకుంటుంటే భరించలేకపోయాడు. రాజేశ్వరి తప్పుచేసివుండవచ్చు. ఐనా ఇందులో ఆమె చేసినతప్పేంవుందిగనుక? కాఫీ విరిగిపోతే ఆ తప్పు ఆమెదెట్లా అవుతుంది?

ఉదయం బొమ్మ పగిలిపోయినపుడు మాత్రం....?

ఆలోచిస్తూనే వేన్నీళ్ళుస్నానంచేశాడు. తువ్వాలుఅక్కడపెట్టి వెళ్ళిపోయింది. ఆక్షణంలో రాజేశ్వరినిచూస్తే జాలేసింది. ఆడవాళ్ళు ఇంతేగావుననిపించింది. తాను అందరిలాంటివాణ్ణికాననే అభిప్రాయం సత్యంలో మొదట్నించీవుంది. కాని ఈవాళ మాత్రం అందరిలాగే ప్రవర్తించాడు.

మధ్యాహ్నంకోపంతో హోటల్లో భోంచేశాడు. ఆలస్యంగా యింటికెళ్ళాడు. వెంకటలక్ష్మి వదిన చెప్పినాసరేవినలేదు. మూడుగంటలప్పుడు తనే ఫ్లాస్కుతీశాడు. అందులో కాఫీ విరిగిపోయివుంది.

''యెందుకు విరిగిపోయింది?'' అన్నాడు

''యేమో నబ్బా'' అన్నది

''యేమో నబ్బా యేమిటి? రోజూ ఫ్లాస్కు క్లీన్ చేస్తున్నావూ?''

"ఆ మాత్రం తెలియదంటారా?"

అదతనికి ఎదురు సమాధానమనుకున్నాడు.....రాత్రి భోజనం దగ్గిరకూచున్నప్పుడు సత్యానికి దుఃఖం వచ్చేసినంతపనయింది.

"రాజీ! నేను దుర్మార్గుడిని. లేకపోతే నిన్ను కొట్టడమేమిటి? నన్ను క్షమించవాదేవీ-నన్ను క్షమించు" అందామనుకున్నాడు.

కాని అభిమానం వంటిదేదో అడ్డొచ్చింది. తనంతటతానే క్షమాపణ చెప్పుకోవడమేమిటనిపించింది.

తాను రెండుమెతుకులుతిని అక్కకు పాలురొట్టెయిచ్చింది. వెంకటలక్ష్మికి సత్యం రాజేశ్వరిని లెంపకాయ వేసినట్టు తెలీదు! ఏదో మాటా మాటా పెరిగిందిగావుననుకుంది. ఉదయం బొమ్మ పగలడం జరిగాక, మళ్ళా అటువంటి పొరపాటే రాజేశ్వరివల్ల జరిగివుంటుందనుకుని మాత్రం ఊహించింది.

మూడున్నరకి గబగబా బట్టలు వేసుకొని సర్వ్రనతను వెళ్ళిపోయేటప్పటికి గదిలో రాజేశ్వరి వొక్కర్తే దిగాలుపడి కూర్చుంది. కళ్ళల్లో నీరు బిగపట్టింది. తననుచూసి యేమిటంటే, యేమీ లేదంది. అలాంటి సమయాల్లో ఎలా ప్రవర్తించాలో వెంకటలక్ష్మికి బాగాతెలుసు. పైగా మరిది మనస్తత్వం, చెల్లెలి మనస్తత్వం కూడా ఆమె కాచివడపోసినవే. కొత్తకాపురంలో ఎవరికైనా పొరపొచ్చాలురావచ్చు. ఏవేవో కోపాలు అలకలువచ్చి, వొచ్చినవి వొచ్చినట్లే పోతుంటాయి. వెంకటలక్ష్మి అందుకే మౌనంగా వూరుకుంది.

రాజేశ్వరి వంటగది సర్దిపెట్టింది. అక్కకు మంచంమీద పక్కవేసింది. ఉదయం అట్లువేసేందుకు పెసలు నానబెట్టింది. ఆపనీ ఈపనీ చూసుకుని పడకగదిలోకి చేరేసరికి సత్యం మంచంమీద కిటికీవార కూచుని బయటకిచూస్తున్నాడు

తెల్లనిదుప్పటిమీద వెన్నెలనీడ చారలు కట్టింది.

గ్లాసుతో పాలు స్టూలుమీద పెట్టింది. గ్లాసు చప్పుడికతను చూస్తాడేమో అనుకుంది. కాని అలాంటిది జరుగలేదు. మంచం వొద్దకువెళ్ళి కొంచెంగా కూర్చుంటూ—' పాలు తాగరూ? అంది.

అతను మాటాడలేదు.

"నామీద కోపం తగ్గలేదూ? పోనీ ఇదిగో మళ్ళా కొట్టండి"

"రా—జీ—"

అతనెప్పుడిటు తిరిగాడో ఎప్పుడు దగ్గరికి తీసుకున్నాడో తల నిమురుతున్నాడు గుండెలమీద పెట్టుకొని.

"నిన్ను కొట్టేనా-నేను-నిన్ను-నిన్ను కొట్టానా రాజీ- యీ పాపిష్టిచేత్తో-"

''వూరుకోండి అలా అనొద్దు" అంటోంది,అతని గుండెల్లోంచి.

ఏ చెంపమీద కొట్టాడో ఆ చెంప పెదవులతో తడుపుతున్నాడు.

"రాజీ—నా రాజీ! నన్ను క్షమించవా దేవీ—"

అందుకే—అతనికోసం చచ్చిపోతేమాత్రమేం అనిపిస్తుంది.

"అట్లా అనకండి వూరుకోరూ—'' యేడుస్తోంది

అతనిలో పశ్చాత్తాపంపొంగి అపరిమితమైన ప్రేమగామారింది. రాజేశ్వరిని యింకా ఇంకా దగ్గిరికి వొత్తుకున్నాడు. గుండెల్లో కలుపుకున్నాడు. మాటలులేవు.

నారింజచెట్టుకింద వెన్నెల నిద్రపోయింది. ఇద్దరూ బయటకువెళ్లారు. లోకం నిండా వెలుగు పండుతోంది. గాలి చెట్లని కావలించుకుంటోంది. వరండాలో చప్పుడయి వెంకటలక్ష్మి లేచికూచుంది. చెల్లెలూ అతనూ నెమ్మదిగా నారింజచెట్టు దగ్గర కెళుతున్నారు. వాళ్ళనిచూసి ఆమెకి అభిమానం ఆప్యాయత పొంగుకొచ్చాయి. ఏడాదిక్రితం పెళ్ళినాడు వాళ్ళిద్దరూ కలిసొచ్చి తన పాదాలకి నమస్కరించిన దృశ్యం జ్ఞాపకం వచ్చింది. మొదట్లోనే ఎంతో చనువుగా పలకరిస్తూ ''దీవించండి వొదినా'' అన్నాడు, తనచెల్లెలు ముద్దలా అయిపోవడం బాగా జ్ఞాపకం.

లేచి గడపదగ్గిర నీడలో నుంచుంది. వెన్నెలకింద వాళ్ళు లీలగా కనిపిస్తున్నారు. సత్యం ఏదో మాట్లాడుతున్నట్టుంది. వెంకటలక్ష్మి ఒక్కసారి'రాజీ'-అనుకుంది. అనుకోలేదు, పైకే అంది. వాళ్ళిద్దరికీ మళ్ళా రాజీ కుదిరిందని ఆమె వుద్దేశమో, లేక చెల్లెలినుద్దేశించి ''రాజీ—నువ్వు అదృష్టవంతురాలివి'' అన్నట్టో—

ఆకాశం నిండావెన్నెల నురగకట్టింది. ఏదేమైనా వెంకటలక్ష్మి అన్నమాట మాత్రం ఇది : "రా జీ"-

రచన:అక్టోబర్-నవంబర్ 1964,ప్రచురణ : ఆంధ్రజ్యోతివీక్లీ 13-6-69